
www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 19 ఫిబ్రవరి 2024
5
తిరుపతి



పాలిటెక్నిక్ విద్యార్థి ఆత్మహత్య

ప్రజాశక్తి- తిరుపతి సిటీ: పాలిటెక్నిక్ విద్యార్థి హాస్టల్ గదులు ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు చిత్తూరు జిల్లా వెదురుకుప్పం మండలం వేణుగోపాల్ పురంకు చెందిన విద్యార్థిని టి.శశి (17) పాలిటెక్నిక్ మొదటి సంవత్సరం చదువుతుంది. శ్రీవెంకటేశ్వర అగ్రికల్చర్ యూనివర్సిటీలోని ప్రియదర్శిని హాస్టల్లో మొదటి అంతస్తులో మరో ముగ్గురు స్నేహితురాళ్లతో కలిసి ఉంటోంది. ఇటీవల జరిగిన పరీక్షల్లో అన్ని సబ్జెక్టులలో ఫెయిల్ కావడంతో మనస్తాపానికి గురై గదిలోని ఫ్యాన్కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. అర్ధరాత్రి వరకు చదువుకున్న తోటి విద్యార్థులు ఆదివారం ఉదయం 8 గంటల సమయంలో నిద్రలేచి చూడడంతో శశి ఫ్యాన్కి వేలాడుతూ కనిపించింది. వెంటనే విద్యార్థులు కేర్ టేకర్ కుమారికి సమాచారం ఇచ్చారు. హాస్టల్ సిబ్బంది ద్వారా విషయం తెలుసుకున్న ప్రిన్సిపాల్ డి.రమణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులతో పాటు మహిళా ఎస్ఐ అరుణ సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించింది. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రుయా మార్చురీకి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్విమ్స్‌లో నిఘా నిల్..!

భద్రత పర్యవేక్షణ అంతంత మాత్రమే..

ప్రజాశక్తి- తిరుపతి సిటి

రాష్ట్రంలో నెంబర్‌వన్ సూపర్‌స్పెషాలిటీ హాస్పిటల్‌గా పేరుగడించిన స్విమ్స్ హాస్పిటల్‌లో నిఘా కళ్లు కరువయ్యాయి. దేశంలోనే మొదటిసారి సుదీర్ఘ విస్తరణలో మహిళలకు ప్రత్యేకంగా వైద్య కళాశాల ఉన్న ప్రాంతంలో, భద్రత పర్యవేక్షణ అంతంత మాత్రంగానే ఉండడం శోచనీయం. టిటిడిలో విలీనం అయిన స్విమ్స్ తీరు మారకపోవడం గమనార్హం.

శ్రీవేంకటేశ్వర వైద్యవిజ్ఞాన సంస్థ (స్విమ్స్) 1200 పడకలకు పైగా సామర్థ్యంతో, రాష్ట్రంలోనే అన్ని రకాల సూపర్‌స్పెషాలిటీ వైద్యసేవలందిస్తున్న అతిపెద్ద ఆసుపత్రి. ప్రపంచాన్ని వణికించిన కరోనా మహమ్మారి విజృంభించిన సమయంలో స్టేట్ కోవిడ్ ప్రధాన కేంద్రంగా సేవలందించిన స్విమ్స్, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రజలందరికి సుపరిచితమే. స్విమ్స్కు అనుబంధంగా దేశంలో ప్రప్రథమంగా మహిళల కోసమే శ్రీపద్మావతి మహిళా వైద్య కళాశాలను ఏర్పాటు చేశారు. అందులోనూ అన్ని రకాల సూపర్‌స్పెషాలిటీ వైద్యసేవలు అందించేందుకు చర్యలు తీసుకున్నారు. ఈ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్, పీజి కోర్సులకు శిక్షణ తీసుకుంటూ వందలాదిమంది మహిళా విద్యార్థినులు ఉంటున్నారు. దీనికి తోడు స్విమ్స్ నర్సింగ్ కళాశాల, పారామెడికల్ కళాశాల, ఫిజియోథెరపీ కళాశాలలో కలిపి వేలాది మంది వైద్య విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. స్విమ్స్, శ్రీపద్మావతి మహిళా వైద్యకళాశాల ఆసుపత్రికి కలిపి ప్రతి రోజు 2వేల మందికిపైగా రోగులు ఓపి సేవల నిమిత్తం వస్తుంటారు. ప్రతి రోజు 300కిపైగా ఇన్‌పేషెంట్లను చేర్చుకుంటారు. రోగులు, రోగి సహాయకులు, వైద్యులు, వైద్య విద్యార్థులు, నర్సులు, పారామెడికల్ సిబ్బంది, పారిశుద్ధ కార్మికులు, సెక్యూరిటీ సిబ్బంది, ఇతరాత్ర వైద్య సిబ్బంది, స్విమ్స్ యూనివర్సిటీ సిబ్బంది, అందులో చదువుకునే అన్ని రకాల వైద్య విద్యార్థులు కలిపి నిత్యం 10వేల మంది వరకు అక్కడ ఉంటున్నారు. వైస్ ఛాన్సలర్, రిజిస్ట్రారు, డీన్లు, ఓ ఐఏఎస్ అధికారి పర్యవేక్షణ, డిప్యూటీ డైరెక్టరు, ఎంఎస్, జిఎం, పిఎం, ఏడిలు ఇలా అనేక మంది ఉన్నతాధికారులు అక్కడ విధులు నిర్వహిస్తుంటారు. ఇంత ప్రాముఖ్యత కలిగిన ఈ ప్రాంతంలో నిఘా కళ్ళు కరువయ్యాయి. వందల ఏకరాల విస్తర్ణం కలిగిన ప్రదేశంలో సిసి కెమెరాలు ఏర్పాటు చేసే ఒట్టు. ఆసుపత్రి లోపల కొన్ని వార్డుల్లో సిసి కెమెరాలు ఉన్నా అవి పనిచేసిన దాఖలాలు లేవు. ఆసుపత్రి వెలుపల, పరిపాలన భవనం వద్ద, క్యాజువాలిటీ, నర్సింగ్ కళాశాల, ఫిజియోథెరపీ కళాశాల, శ్రీపద్మావతి మహిళా వైద్య కళాశాల, మూడు పార్కింగ్ స్థలాలు, రెండు క్యాంటీన్లు, మూడు మెడికల్ షాపులు, ఎస్‌బిఐ బ్రాంచ్, రక్తనిధి, మార్చురీ, డోబీఘాట్, జనరేటర్, గ్యాస్‌నిల్వ కేంద్రాలు, ఓపి విభాగం, సిద్ధ క్లినిక్, ఒకటేంటి అనేక చోట కూడా సిసి కెమెరాలు ఏర్పాటు ఆలోచనే చేయకపోవడం గమనార్హం.

స్విమ్స్ వద్ద సిసి నిఘా లేకపోవడంతో దొంగలకు ఆ ప్రాంతం అడ్డాగా మారుతోంది. బయట ప్రాంతం నుంచి చోరీ చేసిన ద్విచక్ర, ఇతరాత్ర వాహనాలు దొంగలు స్విమ్స్ వద్ద పార్కు చేసి వెళ్లి, మరుసటి రోజు పోలీసుల కళ్లుగప్పి తాపీగా తీసుకెళ్తున్న సంఘటన నిత్యం కోకొల్లలు. ఆసుపత్రికి, ఓపికి, ఐపికి, మహిళా వైద్యకళాశాలకు ఎవరు వస్తున్నారు, ఎవరు పోతున్నారో కూడా అర్థం కాని పరిస్థితి. ఇది సరైనది కాదు, సిసి కెమెరాలను తప్పని సరిగా ఏర్పాటు చేసుకోవాలని పలువురు ఎన్నో సార్లు ప్రతిపాదనలు చేసినా పెడచెవిన పెట్టడం శోచనీయం. స్విమ్స్ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నుంచి టిటిడిలో విలీనం అయినా తీరు మారలేదు. సాక్షాత్తు ఐఏఎస్ అధికారి విసిగా అదనపు బాధ్యతలు నెరవేర్చినా పట్టించుకోలేదు, పూర్తిస్థాయి విసి ఏర్పడిన ఆ దిశగా చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. ఇప్పటికైనా స్విమ్స్, శ్రీపద్మావతి మహిళా వైద్యకళాశాల ఆసుపత్రి, వైద్య కళాశాలల, ఇతరాత్ర ప్రాంతాల్లో సిసి కెమెరాలు ఏర్పాటు చేసి, నిఘా ఉంచి, భద్రతను పర్యవేక్షించాలని పలువురు కోరుతున్నారు.

బంగ్లా లేని కమిషనర్

- అద్దె ఇంట్లోనే వసతి..
- పద్మావతి అతిథిగృహంలో ఉంటున్న కమిషనర్ అదితిసింగ్
- ఇంటి కోసం వెతుకులాడుతున్న రెవెన్యూ శాఖ




తిరుపతి ఎస్వీ యూనివర్సిటీ వద్ద నిర్మాణంలో ఉన్న కమిషనర్ బంగ్లా, క్రైమ్ స్టేషన్ ఎదురుగాశిథిల వ్యవస్థలో ఉన్న పాత మున్సిపల్ కమిషనర్ బంగ్లా

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: ప్రభుత్వ ఉన్నత ఉద్యోగులు బంగ్లాలు తప్పనిసరిగా ఉంటాయి. తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో గత మూడు సంవత్సరాల నుంచి కమిషనర్ బంగ్లా లేక అద్దె ఇండ్లలో ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. తిరుపతి కార్పొరేషన్‌కి 2002 నుంచి 2004 వరకు ముగ్గురు కమిషనర్లు అద్దె ఇళ్లలోనే ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఐఏఎస్ హోదాలో ఉన్న కమిషనర్‌కు బంగ్లా లేకపోవడం ఏమిటని పలువురు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుత తాజా కమిషనర్ అదితి సింగ్ బంగ్లా లేకపోవడంతో పద్మావతి అతిథి గృహంలో ఉండాల్సిన పరిస్థితి వచ్చింది. మున్సిపల్ కార్పొరేషన్ రెవెన్యూ అధికారులు కమిషనర్‌కు సౌకర్యంగా ఉండే అపార్ట్మెంట్ లేదా, ఇండిపెండెంట్ ఇంటిని వెతుకులాడే పనిలో నిమగ్నమైనారు. ప్రస్తుతం ఉపాధ్యాయనగర్లో కమిషనర్ బంగ్లా కోసం మున్సిపల్ రెవెన్యూ అధికారులు పరిశీలన చేస్తున్నారు. తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ అవతరించినప్పటి నుంచి ఇక్కడ కమిషనర్ బంగ్లా ప్రత్యేకంగా నిర్మాణం చేయలేదు. గతంలో కమిషనర్‌గా పనిచేసిన పలువురు క్రైమ్ పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉండే కమిషనర్ బంగ్లాలో ఉండేవారు. అది శిథిలావస్థకు చేరింది. దీంతో కమిషనర్లకు ప్రత్యేకంగా బంగ్లా నిర్మాణం చేపట్టకపోవడంతో నూతనంగా వచ్చే కమిషనర్లకు ఇబ్బందులు తప్పడం లేదు. 2020 నుంచి 22 వరకు ఇక్కడ కమిషనర్‌గా పనిచేసిన గిరీశ కలెక్టర్ బంగ్లా సమీపంలో జేసీ బంగ్లా ఉండేవారు. కార్పొరేషన్ నిధులు ఖర్చుపెట్టి ఆ బంగ్లాను ఆధునీకరణ చేసుకోవడం జరిగింది. 2022 ఏప్రిల్ ఒకటి తిరుపతి ప్రత్యేక జిల్లా ఏర్పడడంతో ఇక్కడున్న గిరీష అన్నమయ్య జిల్లాకు కలెక్టర్‌గా బదిలీ వెళ్లిపోయారు. తర్వాత ఈ బంగ్లాను అప్పటి జేసి డీకే బాలాజీ తీసుకోవడం జరిగింది. తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ నూతన కమిషనర్‌గా అనుపమ అంజలిని అప్పట్లో నియమించారు. ఆమెకు బంగ్లా లేకపోవడంతో జూ పార్క్ వద్ద అద్దెఇళ్లలో ఉండాల్సి వచ్చింది. దీని గాను నెలకు రూ.50వేల మున్సిపల్ కార్పొరేషన్ అద్దె చెల్లించేవారు. ఏడాది వరకు పనిచేసిన అనుపమాంజలి తరువాత మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా హరిత నియమించారు. కమిషనర్ హరిత తిరుపతి వాసి కావడంతో ఆమె తన సొంత ఇంట్లో నివాసం ఉండేవారు ఇటీవల హరిత విజయవాడ అర్బన్ ఫైనాన్స్ డిపార్ట్మెంట్ బదిలీ వెళ్ళిపోయారు. తాజాగా మున్సిపల్ కమిషనర్‌గా అదితి సింగ్ కమిషనర్‌గా రావడంతో బంగ్లా లేకపోవడంతో ఆమె పద్మావతి అతిథిగృహంలోనే ఉండాల్సి వచ్చింది.

నత్తనడకగా కమిషనర్ బంగ్లా పనులు..

తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఐఏఎస్ హోదా కావడంతో గత ఏడాది కమిషనర్ బంగ్లా నిర్మాణం కోసం ఎస్వీ యూనివర్సిటీ వద్ద సుమారు రెండు కోట్లతో మున్సిపల్ నీటిట్యాంకు సమీపం వద్ద భూమిపూజ పనులు చేపట్టారు. పనులు నత్తనడక సాగుతున్నాయి. కాంట్రాక్టర్లకు సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో పనులు కూడా మెల్లమెల్లగానే సాగుతూ ఉన్నాయి. బంగ్లా నిర్మాణానికి నిధులు సకాలంలో వెచ్చించకపోవడం వల్లే ఈ సమస్యకు కారణమని తెలుస్తోంది. కాంట్రాక్టర్ బిల్లులు తక్షణమే చెల్లించి కమిషనర్ బంగ్లా పనులు పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది.

అడిషనల్ డిప్యూటీ కమిషన్ల పరిస్థితి కూడా అంతే...

తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌కే బంగ్లా దిక్కు లేకపోవడం ఒక కారణమైతే. గ్రూప్ వన్ గ్రూప్ టు కేడర్ అయిన అడిషనల్, డిప్యూటీ కమిషనర్లు కూడా అద్దె ఇళ్లల్లో ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. వీరు కూడా బంగ్లాలు లేకపోవడంతో అవస్థలు పడాల్సి వస్తుంది. 2007లో తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్‌గా అవతరించింది. అప్పటినుంచి ఇప్పటివరకు అడిషనల్ డిప్యూటీ కమిషనర్లు అద్దె ఇళ్లల్లోనే ఉంటున్నారు. వీరికి కూడా బంగ్లా నిర్మించి ఇవ్వాల్సిన అవసరం కార్పొరేషన్ ఉన్నత అధికారులకు ఉంది. అయితే అధికారులు ఎందుకు బంగ్లా నిర్మాణాలు చెప్పడం లేదో అర్థం కావడం లేదు. స్మార్ట్ సిటీ పథకంలో 1610 కోట్లతో ఎన్నో అభివద్ధి పనులు చేపట్టారు కమిషనర్ అడిషనల్ డిప్యూటీ కమిషనర్ బంగ్లాలు లేకపోవడమే విచిత్రంగా ఉంది.

అడవిలో గున్న ఏనుగు మృతి



పోస్టుమార్టం అనంతరం ఏనుగు కలేబరాన్ని కాల్చుతున్న అటవీ శాఖ అధికారులు


ప్రజాశక్తి- చంద్రగిరి: తిరుపతి జిల్లా, చంద్రగిరి మండలం, కూచువారిపల్లి (భీమవరం) అటవీ ప్రాంతంలో ఏడాది వయసు గల గున్న ఏనుగు కలేబరాన్ని కూంబింగ్ నిర్వహిస్తున్న ఫారెస్ట్ అధికారులు ఆదివారం ఉదయం గుర్తించారు. గత 20 రోజులుగా సుమారు 18 ఏనుగుల గుంపు యల్లంపల్లి పరిసర ప్రాంతాల్లో పంట పొలాలపై దాడులు చేస్తున్నాయి. ఏనుగులు పంట పొలాలపై దాడులు చేయకుండా నివారించేందుకు అటవీశాఖ సిబ్బంది ఏనుగులను అడవి వైపు మళ్లించేందుకు కూంబ్లింగ్ నిర్వహించారు. ఈ కూంబ్లింగ్ నిర్వహణలో అటవీ సిబ్బంది భీమవరం అటవీ ప్రాంతంలో కూంబ్లింగ్ నిర్వహిస్తుండగా దుర్వాసన రావడంతో సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకున్నారు. పది రోజులకు ముందు గున్న ఏనుగు మృతి చెందినట్లు గుర్తించి అటవీ శాఖ డీఎఫ్ఓ సతీష్ రెడ్డి, ఫ్లయింగ్ స్క్వాడ్ డీఎఫ్ శివకుమారులకు సమాచారాన్ని తెలియజేశారు. సమాచారం తెలుసుకున్న డిఎఫ్ఓ లు సతీష్ రెడ్డి, శివకుమార్‌లు ఉదయం 11 గంటలకు అటవీ ప్రాంతంలోకి వెళ్లి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతి చెందిన గున్న ఏనుగు ఆ ఏనుగుల గుంపుకు చెందినదిగా ఫారెస్ట్ అధికారులు తెలిపారు. తల్లి నుంచి విడిపోయి, ఆహారం తాగనీరు లేక గున్న ఏనుగు అనారోగ్యానికి గురై చనిపోయిందని డీఎఫ్వోలు నిర్ధారించారు. అనంతరం డిఎఫ్ఓలు గున్న ఏనుగును అటవీ ప్రాంతంలోనే పశు వైద్యాధికారులచే శవపరీక్ష నిర్వహించారు. అనంతరం గున్న ఏనుగు పార్థవదేహాన్ని అడవిలోనే పంచనామా చేసి కాల్చివేశారు. మృతి చెందిన గున్న ఏనుగు ఎముకలను, చర్మాన్ని, అవయవాలను శాంపుల్స్ తీసుకొని పశు వైద్య విశ్వవిద్యాలయం ల్యాబ్‌కు పంపించామని డీఎఫ్ఓ సతీష్ రెడ్డి తెలిపారు. పోస్టుమార్టంకు సంబంధించి, పశు వైద్య విశ్వవిద్యాలయం ల్యాబ్ నుంచి నివేదికలు వచ్చిన తర్వాత పూర్తి వివరాలు తెలియజేస్తామని తిరుపతి డిఎఫ్ఓ సతీష్‌రెడ్డి తెలిపారు. ఈపరిశీలనలో ఎఫ్ఆర్వో దత్తాత్రేయ, అటవీ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

అనిమల్ ట్రాకర్స్ ఏమయ్యారు.?

ఏనుగుల గుంపు నుండి సంవత్సరం వయసు కలిగిన గున్న ఏనుగు విడిపోయినప్పుడు అనిమల్ ట్రాకర్స్ గుర్తించి ఎందుకు గున్న ఏనుగును ఏనుగుల గుంపులోకి చేర్చలేకపోయారు, అసలు చంద్రగిరి, పాకాల ప్రాంతాలలో ఏనుగుల గుంపులు సంచరించి పంట పొలాలపై దాడులు చేస్తున్నప్పుడు అటవీ శాఖ అధికారులు అనిమల్ ట్రాకర్స్‌ను అందు బాటులో ఉంచారా... లేదా.....? అనేది పలువురు స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అనిమల్ టాక్టర్స్ పర్యవేక్షణ లోపంతోనే గున్న ఏనుగు మృతి చెందిందని విశ్లేషకులు అంటున్నారు.

వైసిపి, టిడిపి నుంచి రాజమండ్రి ఎంపీగా ఆఫర్

ప్రజలకు మేలు చేసే మేనిఫెస్టోకే నా మద్దతు: సినీనటుడు సుమన్ వెల్లడి



ప్రజాశక్తి- తిరుపతి టౌన్: వైసిపి, టిడిపి పార్టీల నుంచి రానున్న ఎన్నికల్లో రాజమండ్రి ఎంపీగా పోటీ చేయాలని ఆఫర్లు వచ్చినట్లు సినీ నటుడు సుమన్ వెల్లడించారు. ఆదివారం తిరుపతి తాతయ్యగుంట గంగమ్మను సుమన్ దర్శించుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో జరగనున్న అసెంబ్లీ పార్లమెంట్ ఎన్నికల్లో ఇటు టిడిపి అటు వైసిపిల నుంచి తనను పోటీ చేయాలని ఆఫర్ వచ్చినట్లు తెలిపారు. తన రాజకీయ గురువు చంద్రబాబు అని చెప్పారు. అయితే తాను రాష్ట్ర విభజన అనంతరం హైదరాబాదులో ఉండిపోవడం వల్ల ఆంధ్రరాష్ట్రంలో పోటీ చేయడానికి అంత ఆసక్తిగా లేదని చెప్పారు. ఆంధ్రరాష్ట్రంలో పోటీ చేయాలంటే తాను మూడు రోజులు ఆంధ్రాలో నాలుగు రోజులు తెలంగాణలో ఉండలేనని పేర్కొన్నారు. సంవత్సరం ముందు పోటీ చేయాలని తనకు రెండు రాజకీయ పార్టీలు పిలిచి ఉంటే వచ్చి ఉండేవాడిని చెప్పారు, ఇప్పుడు వచ్చి పోటీ చేయాలంటే తనకు ఆసక్తి లేదన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజలకు మేలు చేసే మేనిఫెస్టోకే తన మద్దతు ఉంటుందని తెలిపారు. ముఖ్యంగా వృద్ధులకు, యువత, మహిళలు, రైతులకు మేలు చేసే మేనిఫెస్టో ఉండాలని కోరారు. చాలావరకు ఎన్నికల్లో మేనిఫెస్టో రూపొందించిన పార్టీలు వాటిని సాధ్యాసాధ్యాలు పరిశీలించకుండా హామీలు ఇవ్వడం తగదన్నారు. ముఖ్యంగా వైద్యంలో, పెన్షన్లు సౌకర్యం, ఇతర సదుపాయాల్లో వృద్ధులకు ప్రాధాన్యత కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రంలో యువత గంజాయి, డ్రగ్స్‌కు అలవాటు పడకుండా వారిని కట్టడి చేసేందుకు ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కోరారు. యువతకు ఉపాధి కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. గంగమ్మ ఆలయంలో సినీ నటుడు సుమన్‌కు ఆలయ అధికారులు స్వాగతం పలికి అమ్మవారి దర్శన ఏర్పాట్లు చేసి తీర్థప్రసాదాలు అందజేశారు.

పొంచి ఉన్న.. బర్డ్ ఫ్లూ..



కోళ్లకు బర్డ్‌ఫ్లూ వ్యాధి రాకుండామందు పిచికారి చేస్తున్న దృశ్యం

- దృష్టి సారించని ఆరోగ్యశాఖ
- నెల్లూరు సంఘటనతో నగరంలో పడిపోయిన చికెన్ అమ్మకాలు
- కేఎఫ్‌సి, ఎంఎఫ్‌సిలపై ప్రభావం
- పౌల్ట్రీ పరిశ్రమకు తీరని నష్టం

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: **రాష్ట్రంలో ఏ జిల్లాలో లేని విధంగా నెల్లూరు జిల్లాలో బర్డ్ ఫ్లూ వ్యాధి కలకలం కలిగిస్తోంది. తిరుపతి జిల్లాలో బర్డ్ ఫ్లూ ముప్పు పొంచి ఉందని ప్రచారం సాగడంతో తిరుపతి జిల్లాలో చికెన్ అమ్మకాలు బాగా పడిపోయినట్లు వ్యాపారస్తులను చెబుతున్నారు. నెల్లూరు జిల్లాకి సమీపంలో ఉన్న గూడూరు, నాయుడుపేట, వెంకటగిరి మున్సిపాలిటీలు తిరుపతి జిల్లాలో ఉండడంతో ఈ జిల్లాలో కూడా వ్యాపించి ఉంటుందని ప్రజలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. తిరుపతిలో చికెన్ కిలో రూ.250లు ఉండగా బర్డ్ ఫ్లూ కారణంగా ప్రస్తుతం రూ.240 నుంచి 220 రూపాయలు అమ్ముతున్నారు. బర్డ్ ఫ్లూ వ్యాధి పట్ల తిరుపతి జిల్లాలో ఆరోగ్యశాఖ అధికారులు ఇటు మున్సిపల్ కార్పొరేషన్ ఆరోగ్యాధికారులు ఎలాంటి అప్రమత్త చర్యలు చేపట్టలేదు. ఈ విషయం మున్సిపల్ కార్పొరేషన్ ఆరోగ్యాధికారులు బర్డ్ ఫ్లూ వ్యాధి గురించి అడగగా వైద్యఆరోగ్యశాఖ అధికారులతో సంప్రదించి నిర్ణయం తీసుకుంటామని తెలియజేశారు.**

తిరుపతి జిల్లాలో బర్డ్‌ఫ్లూ వ్యాపించినట్లు ఎక్కడ తమకు సమాచారం రాలేదని అంటున్నారు. అయితే ప్రజలు మాత్రం చికెన్ తినడానికి కొంతవరకు భయపడుతున్నారు. చికెన్‌కు బదులు చాలామంది చేపలు, మటన్, రొయ్యలు తీసుకోవడానికి ఇష్టపడుతున్నారు. కాగా బర్డ్ ఫ్లూ వార్తలతో చికెన్‌కు డిమాండ్ తగ్గడంతో పౌల్ట్రీ పరిశ్రమ అల్లాడుతోంది. ఇప్పటికే అత్యంత ధర కలిగిన మటన్ మరింత రేటు పెరగగా, చేపలకు, రొయ్యలకు డిమాండ్ పెరిగింది. పరిస్థితిని బట్టి తిరుపతి జిల్లాల్లో కోళ్లకు వైరస్ ఉందా లేదా పరీక్షించిన తర్వాతే నిర్ణయం తీసుకుంటామని ఆరోగ్య శాఖ అధికారులు అంటున్నారు. తిరుపతి జిల్లాతో పాటు ఉమ్మడి చిత్తూరు జిల్లాలో గతంలో బర్డ్ ఫ్లూ వ్యాధి వచ్చి అనేక కోళ్లు చనిపోయిన విషయం తెలిసిందే.

పౌల్ట్రీ పరిశ్రమల యాజమాన్యాలు ఆందోళన..

ఉరుము లేని పిడుగులా బర్డ్‌ఫ్లూ పిడుగు జిల్లా నెత్తిన పడడంతో ఫౌల్ట్రీ పరిశ్రమ యజమానులు ఆందోళనలో మునిగిపోయారు. లక్షలు, కోట్లు వెచ్చించి వడ్డీలకు అప్పులు తెచ్చి కోళ్ల పరిశ్రమలను ఉపాధిగా చేసుకుని వేలాది కోళ్లను పెంచుతున్నామని, ఇలాంటి పరిస్థితుల్లో బర్డ్ ఫ్లూ వార్తలు, చికెన్ విక్రయ నిషేధాలు తమకు ఆందోళన కలిగిస్తున్నాయని కొందరు ఫౌల్ట్రీ పరిశ్రమ యజమానులు చెప్పారు. చికెన్ కొనుగోలు చేస్తేనే తమకు పూటగడవదని, ఈ చికెన్ విక్రయాలే తమకు, తమ కుటుంబాలకు ఉపాధి చూపుతున్నాయని, అలాంటి చికెన్ పరిశ్రమ బర్డ్ ఫ్లూ వ్యాధితో కుదేలైతే తాము ఎలా జీవనం కొనసాగించాలని ఆవేదన వ్యక్తం చేస్తున్నా రు. మరోవైపు నగరంలోని వీధుల్లో చిన్నచిన్న నెట్టుడు బండ్ల మీద చికెన్ పకోడ, స్టిక్ చికెన్, చికెన్ బిరియాలు, లివర్ ఫ్రై, లెగ్ పీస్లు, తదితరాల అమ్ముకుంటూ జీవనం కొనసాగించేవారు. ఇక తమకు వ్యాపారాలు లేవని, తమ నోట్లో బర్డ్ ఫ్లూ మన్ను కొట్టిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చికెన్ విక్రయాలు, మాంసపు కొట్టుళ్లు, డ్రెస్సింగ్ తదితరాలపై ఆధారపడి బ్రతికే వారి సంఖ్య ఒక్క తిరుపతి నగరంలోనే 1600 నుంచి 1700 మంది దాకా ఉ న్నట్లు సమాచారం. చికెన్ దుకాణాలు పూర్తిగా మూత పడిపోతే వీరందరికీ ఒక్కసారిగా ఉపాధి కరువు అవుతుంది.

కెఎఫ్‌సి, ఎంఎఫ్‌సికి తగ్గనున్న ఆర్డర్లు..

తిరుపతి జిల్లాల్లో బర్డ్ ఫ్లూ వ్యాపించి కోళ్లు లేకపోతే కెఎఫ్‌సి, ఎంఎఫ్‌సి లాంటి కార్పొరేట్ షాపులకు ఆర్డర్లు తగ్గిపోయే ప్రమాదం ఉందని వారు అంటున్నారు. జిల్లాలో కోళ్లకు బర్డ్‌ఫ్లూ వ్యాపించిందని తెలిస్తే, ఉన్నతాధికారులు కఠిన చర్యలు తీసుకోవాల్సి వస్తుంది. జిల్లా పరిధిలో కార్పొరేట్ రంగంలో ప్రజలకు ఫ్రైడ్ చికెన్ వెరైటీలను అందిస్తున్న కెఎఫ్సీ, ఎంఎఫ్సీ, జీఎఫ్సీ లాంటి చికెన్ వంటకాలకు కూడా పుల్‌స్టాప్ పడినట్లు అవుతుంది. నాన్‌వెజ్ హోటళ్లలో చికెన్ అన్నది కరువు కావడంతో మాంసాహార భోజనప్రియులు మటన్, చేపలు, రొయ్యలు వంటకాలపైనే ఆర్డర్లు ఇవ్వాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. అయితే వాటి వంటకాల ధరలు ఆకాశానంటుతుండడంతో ఇప్పటివరకు సామాన్యులకు చికెన్ వంటకాలు మాత్రమే ఎంతోకొంత అందుబాటులో ఉండేవి. ఇక నుంచి నిషేదం విధిస్తే అధిక ధరలు వెచ్చించి మటన్, చేపలు, రొయ్యలు వంటకాలకు మాత్రమే ఆర్డర్లు ఇవ్వాల్సి ఉంది. బర్డ్ ఫ్లూ వ్యాప్తితో అధికారులు తీసుకునే నిర్ణయాలతో చికెన్ వంటకాల ఆర్డర్లు పూర్తిగా నిలిచిపోవడంతో జొమాటో, స్విగ్గి లాంటి సంస్థల్లో పనిచేస్తూ వారికి ఆర్డర్లు ఉండవు.

జొమాటో, స్విగ్గికు కష్టకాలం...

తిరుపతి జిల్లాలో బర్డ్ ఫ్లూ తో కోళ్ళు ను నిషేధిస్తే.. ఆయా ఆర్డర్లు తమ ద్విచక్రవాహనాలపై డెలివరి చేస్తున్న జొమాటో, స్విగ్గి లాంటి సంస్థల డోర్ డెలివరీ బాయ్స్ కూడా పూర్తిగా పనులు తగ్గిపోయే ప్రమాదం ఉందని డెలివరీ బాయ్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక్క బర్డ్ ఫ్లూ వేలాది మందికి ఒక్కరోజులోనే ఉపాధిని హరించి వేసే విధంగా ఉంది. ఈ బర్డ్ ఫ్లూ మా పాలిట శాపమని, నగరంలో కోళ్ల ఉత్పత్తులపై ఆధారపడి ఉన్న వేలాది మంది వ్యాఖ్యానిస్తున్నారు. ఇక ఫిబ్రవరి, మార్చి నెలల్లో వివాహాలు, ఫంక్షన్లు, గృహప్రవేశాలు ఎక్కువగా ఉండడంతో వివాహాల తర్వాత ఆయా పెళ్లిళ్ల కుటుంబాలు తమ బంధుమిత్రులను పిలిచి తమదైన స్థాయిలో డిన్నర్లు, లంచ్లు ఏర్పాటు చేస్తుంటారు. ఇలాంటి వాటిల్లో నాన్వెజ్ వంటకాలే ఎక్కువగా ఉంటాయి. అందుల్లో చికెన్ ది క్వాంటిటీలో ప్రథమస్థానం. ఎందుకంటే చికెన్ రేట్ ఎంత ఆకాశాన్నంటినా సామాన్య, మధ్య తరగతి ప్రజలకు ఇప్పటికీ అందుబాటులో ఉంది.

పదవ తరగతి పరీక్షల్లో..

అగ్రస్థానం సాధించడమే లక్ష్యం

జిల్లావిద్యాశాఖ అధికారి శేఖర్



ఇంటర్వ్యూ

ప్రజాశక్తి- తిరుపతి: పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ఈసారి అగ్రస్థానం సాధించడమే తమ లక్ష్యమని జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ వి.శేఖర్ పేర్కొన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు, ప్రభుత్వ పాఠశాలల్లో పర్యవేక్షణ మరింత పెంచేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. పిల్లలను సరైన మార్గంలో పయనింపజేసేందుకు పక్కా ప్రణాళికతో విద్యావ్యవస్థలో ప్రభుత్వం సమూల మార్పులు తీసుకొచ్చిందన్నారు. ఈ ఏడాది పదవ తరగతి ఫలితాల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించే విధంగా కృషి చేస్తున్నామన్నారు. సందర్భంగా ఆయన 'ప్రజాశక్తి ఇంటర్వ్యూ'లో పలు అంశాలను వెల్లడించారు.

ప్రజాశక్తి : 10వ తరగతి పరీక్షలు ఎప్పటి నుంచి జరగనున్నాయి.?

డీఈవో: సార్వత్రిక ఎన్నికలు ఏప్రిల్లో జరగనున్న నేపథ్యంలో ఈసారి ప్రభుత్వం ముందస్తుగానే 10వ తరగతి పరీక్షలు నిర్వహించనుంది. మార్చి నెల 18 నుంచి 30 వరకూ పరీక్షలు రోజూ ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు జరగనున్నాయి.

ప్రజాశక్తి : పరీక్షల నిర్వహణ ఏ విధంగా ఉంటుంది.?

డీఈవో: విద్యార్థి భవిష్యత్తుకు 10వ తరగతి తొలి మెట్టు. ఈ తరుణంలో పకడ్బందీగా పరీక్షలు నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం. అవసరమైన కేంద్రాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తాం. పాఠశాలలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి ప్రత్యేక శిక్షణను అందిస్తున్నాం. ప్రభుత్వం అందించిన స్టడీ మెటీరియల్ను పంపిణీ చేసి పరీక్షలకు సన్నద్ధం చేస్తున్నాం. ఫ్లయింగ్, సిట్టింగ్ స్క్వాడ్ సంఖ్య పెంచుతాం. పరీక్షలను అత్యంత కట్టుదిట్టంగా నిర్వహిస్తాం. పిల్లలు స్వేచ్ఛాయుత వాతావరణంలో పరీక్షలు రాసేలా ఏర్పాట్లు చేస్తున్నాం. జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ నేతృత్వంలో అన్ని శాఖల అధికారులతో సమన్వయ సమావేశాన్ని నిర్వహించాం. ఎటువంటి ఇబ్బందులు, ఆటంకాలు లేకుండా పరీక్షలు విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన చర్యల్ని చేపట్టాం.

ప్రజాశక్తి : ఎన్ని పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు.?

డీఈవో: జిల్లా వ్యాప్తంగా 162కేంద్రాల్లో పదో తరగతి పరీక్షలు జరగనున్నాయి. మొత్తం 30,921 మంది పరీక్ష రాయనున్నారు. పరీక్ష ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 వరకూ ఉంటుంది. ప్రతి పరీక్షా కేంద్రం వద్దా తాగునీటి వసతి, ఒఆర్ఎస్ ప్యాకెట్లు, బీపీ, సుగర్ చెక్ చేసే పరికరాలు, అత్యవసర మందులతో వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది ఒకరు అందుబాటులో ఉంటారు .అన్ని పరీక్షా కేంద్రాల వద్దా 144 సెక్షన్ అమల్లో ఉంటుంది. మాస్కోపీయింగ్ నిరోధించేందుకు ఆరు ఫ్లయింగ్ స్క్వాడ్లను ఏర్పాటు చేసి ప్రతిరోజూ కేంద్రాలను తనిఖీ చేయనున్నారు. సమస్యాత్మక కేంద్రాలపై ప్రత్యేక దృష్టి పెట్టాము.

ప్రజాశక్తి : ఎలాంటి యాక్షన్ ప్లాన్ అమలు చేస్తున్నారా.?

డీఈవో: సమ్మెటివ్ పరీక్షల అనంతరం విద్యార్థులను, పాఠశాలలను, మండలాలను గ్రేడులుగా విభజించాము. ఉదయం 9 గంటల నుంచి పాఠశాలలు ప్రారంభమవుతాయి. 100 రోజుల యాక్షన్ ప్లాన్లో భాగంగా సాయంత్రం అదనపు తరగతులు నిర్వహిస్తున్నాం. సబ్జెక్టులు, మండలాల వారీగా సమీక్షలు, తల్లిదండ్రులు సమావేశాలు నిర్వహిస్తున్నాం.

ప్రజాశక్తి: ప్రభుత్వ బడుల బలోపేతానికి ఏచర్యలు తీసుకుంటున్నారు.?

డీఈవో : ప్రభుత్వం విద్యా రంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తోంది. నాడు-నేడు కార్యక్రమంలో భాగంగా సర్కారు బడుల రూపురేఖలు మారాయి. ఇప్పటికే తొలిదశ పూర్తి కాగా రెండో విడత పనులు కొనసాగుతున్నాయి. ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ కనబర్చడంతో కార్పొరేట్ తరహాలో మౌలిక వసతులు కల్పిస్తున్నాం. అధికారులు పర్యవేక్షణ తప్పనిసరిగా ఉండాలి. హెచ్ఎంలు ప్రతి 15 రోజులకోసారి తల్లిదండ్రుల కమిటీ సమావేశం నిర్వహించాలి. ప్రతి వారం ఉపాధ్యాయులతో హెచ్ఎం సమీక్షించడం తప్పనిసరిగా ఉండాలి.

65 మందికి కంటి పరీక్షలు

ప్రజాశక్తి-తిరుపతి డెస్క్: ప్లాటినం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో చెన్నై శంకర్ నేత్రాలయ ఆసుపత్రి వైద్య బృందం నిర్వహించిన కంటి వైద్య శిబిరంలో 65మంది పరీక్షలు చేయించుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆదివారం పాకాలలో ఏర్పాటు చేసిన శిబిరంలో 15మందిని ఆపరేషన్‌లకు ఎంపిక చేశారు. వారికి సోమవారం చెన్నైలో ఉచితంగా శస్త్ర చికిత్సలు చేయనున్నట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో జయరామనాయుడు, కుప్పస్వామి నాయుడు, అనీల్ కుమార్, దొరపార్థు, జశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే దాతృత్వం

ప్రజాశక్తి-ఏర్పేడు: మండలంలోని పాపానాయుడుపేటకు చెందిన విద్యార్థి పద్మప్రియ బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ఆర్థిక పరిస్థితి బాగోలేక ల్యాప్‌ట్యాప్ కావాలని గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో ఎమ్మెల్యే బియ్యపు మధుసుదన్‌రెడ్డిని విద్యార్థి పద్మప్రియ కోరారు. వెంటనే ఎమ్మెల్యే ఆ విద్యార్థి ల్యాప్‌టాప్ అందజేసి దాతృత్వాన్ని చాటుకున్నారు.

బహుమతుల ప్రదానం

ప్రజాశక్తి-ఏర్పేడు: మండలంలోని పాత వీరాపురంలోని ఎంపీ యూపీ పాఠశాలలో నెహ్రూ యువ కేంద్రం, యువనేస్తం అసో సియేష్ సంయుక్తంగా వాలీబాల్ పోటీలు నిర్వహించారు. విజే తలకు అసోసియేషన్ అధ్యక్షులు మునిశేఖర్ బహుమతులు ప్రదానం చేశారు.

టీడీపీతోనే అభివృద్ధి: మాజీ ఎమ్మెల్యే

ప్రజాశక్తి-గూడూరుటౌన్: టీడీపీ అధికారంలోకి వస్తేనే అభివృద్ధి సాధ్యమవుతుందని మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. ఆదివారం గూడూరులో టీడీపీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ టీడీపీపై నమ్మకంతో అనేక మంది పార్టీలోకి వస్తున్నారని, వారందరికీ స్వాగతం పలుకుతున్నట్లు చెప్పారు. ఏ సమస్య వచ్చినా వారికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. పార్టీ విజయానికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు కిరణ్‌కుమార్, భాస్కర్‌రెడ్డి, చెంచురామయ్య, వెంకటేశ్వరరెడ్డి, లీలావతి, రహీం పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి-గూడూరుటౌన్: ప్రయోజకులైన పూర్వ విద్యార్థులు వారు చదివిన విద్యా సంసథ అభివృద్ధికి తోడ్పాటు అందించాలని అల్యూమినియం అసోసియేషన్ జి.ఐ.సి.టి అధ్యక్షుడు చంద్రమోహన్ పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని ప్రభుత్వ సిరామిక్ కళాశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తాము చదువుకున్న అభివృద్ధికి శక్తి మేర మా అసోసియేషన్ ఆధ్వర్యంలో సహాయం చేయడం జరిగిందని, భవిష్యత్తులో కూడా కళాశాల అభివృద్ధికి సహకారం అందిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ సత్యనారాయణరావు, రిటైర్డ్ ప్రిన్సిపాల్ సుబ్బారావు, అసోసియేషన్ సెక్రెటరీ సుబ్రమణ్యం, శ్రీనివాసరావు, పాండు, నరసింహులు, అరుణ్‌కుమార్, రామకృష్ణ, వెంకటేష్, విజయలక్ష్మి, జాలేంద్ర పాల్గొన్నారు.

ఓటుకు నోటు వద్దే వద్దు..

ప్రజాశక్తి-ఏర్పేడు: మండలంలోని కొత్త వీరాపురం అగ్రహారంలో శ్రీకాళహస్తి ఇండిపెండెంట్ ఎమ్మెల్యే అభ్యర్థి, యువ సమాజ్ నిర్మాణ సేవా సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ రమేష్ ఆధ్వర్యంలో ఓటుకు నోటు వద్దే వద్దు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కరపత్రాలను పంపిణీ చేశారు.

నిరంతరంగా హెల్పింగ్ హ్యాండ్స్ సేవలు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: హెల్పింగ్ హాండ్స్ సంస్థ సేవలు నిరంతరం కొనసాగుతాయని ఆ సంస్థ నిర్వాహకుడు మునీర్ బాషా తెలిపారు. సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం 146వ నెల ప్రత్యేక ప్రతిభావంతులకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. గత 146 నెలలుగా తమ సంస్థ పట్టణంలోని పేదవారికి, ప్రత్యేక ప్రతిభావంతులకు నిత్యావసర సరుకులను పంపిణీ చేయడం ఆనందంగా ఉందని మునీర్ తెలిపారు. మరికొందరు పేదలకు ఆర్థిక సాయం కూడా అందజేస్తూ తమ వంతు సమాజ సేవ చేస్తున్నామనీ, భవిష్యత్తులో కూడా సేవా కార్యక్రమాలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. సంస్థ సభ్యులు శ్రావణి, బాబా తదితరులు పాల్గొన్నారు.

సిమెంట్ బస్తాలు అందజేత

ప్రజాశక్తి-ఏర్పేడు: మండలంలోని ఆమండూరు గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్నటువంటి కావమ్మ మారయ్య గుడి నిర్మాణానికి శ్రీకాళహస్తి మండలం రాచగున్నేరికి చెందిన జె.కె స్టీల్స్ అధినేత బొల్లినేని జగన్నాథం నాయుడు 30బస్తాల సిమెంటును విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో రాజు, మురగయ్య, మునిరాజా పాల్గొన్నారు.

వైసీపీ చంద్రగిరి కన్వీనర్‌గా మస్తాన్

ప్రజాశక్తి-రామచంద్రపురం(చంద్రగిరి): వైసీపీ చంద్రగిరి కన్వీనర్‌గా మాజీ మార్కెట్ యార్డు ఛైర్మన్ షేక్ మస్తాన్‌ను నియమించారు. ఈ మేరకు తుడా ఛైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఆలయంలో లీకేజీల నివారణకు చర్యలు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ పైకప్పులో ఏర్పడ్డ లీకేజీలను అరికట్టేందుకు పూణేకి చెందిన ఉత్తరా దేవి చారిటబుల్ అండ్ రీసెర్చ్ ఫౌండేషన్ చర్యలు చేపట్టింది. రూ.4 కోట్ల వ్యయంతో లీకేజీలను అరికట్టడానికి ఆ సంస్థ అధినేత వెంకటేశ్వరరావు ముందుకు వచ్చారు. ఆదివారం నుంచి పనులు ప్రారంభమయ్యాయి. పురాతనమైన దేవాలయాలు కాపాడే పద్ధతిలో కాంక్రీట్ వ్యవస్థ కాకుండా స్పటిక బెల్లం, గళ్ళ సున్నము, కరక్కాయ, శురికి, మెత్తటి ఇసుక కలిపిన మిశ్రమంతో లీకేజీలను అరికట్టే పనులు చేస్తున్నారు. లీకేజీలు అరికట్టగలిగితే మరో వందేళ్ల లీకేజీల సమస్య ఉండదని ఇంజినీరింగ్ అధికారులు తెలిపారు.

'జనసేనతోనే రాష్ట్రానికి భవిష్యత్తు'

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: జనసేన-టిడిపి ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి వస్తేనే రాష్ట్ర భవిష్యత్తు బాగుంటుందని జనసేన నియోజకవర్గం ఇన్‌ఛార్జ్ వినుత కోట అన్నారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో జనసేన పార్టీని ఆదరించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ప్రసాద్, గణేష్, అఖిల్ సాయి, సుబ్బు, మునీంద్ర, రవికుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసరాలు పంపిణీ

ప్రజాశక్తి-ఏర్పేడు: మండలంలోని బండారుపల్లి గ్రామానికి చెన్నంపల్లి బాలాజీ కుటుంబానికి రష్ హాస్పిటల్ అధినేత, ఎమ్మెల్సీ డా.సిపాయి సుబ్రమణ్యం ఆదివారం పరామర్శించారు. బాలాజీ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. సిపాయి భరోసా కింద 40నిత్యవసర సరుకులు ఇవ్వడం జరిగింది, కార్యక్రమంలో వెంకటరెడ్డి, మధురెడ్డి, జనార్ధన్‌రెడ్డి, దేశిరెడ్డి, అంకిరెడ్డి, రఘునాదరెడ్డి, చంద్రరెడ్డి, శివరెడ్డి, సుబ్బరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ గెలుపుకు కృషి చేద్దాం: ఎమ్మెల్సీ

ప్రజాశక్తి-గూడూరుటౌన్: వైసీపీని గెలిపించుకొనేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ అన్నారు. ఆదివారం మండలంలోని కామాక్షి నగర్ ప్రాంతంలో ఉన్నా ముత్తుమారి అమ్మన్ కల్యాణ మండపంలో ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. సమావేశంలో గోపాల్‌రెడ్డి, దేవసేనమ్మ, విజయకుమార్ రెడ్డి, విజయమోహన్ రెడ్డి, మీరారెడ్డి, కల్పలత, నరేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అమ్మో.. వానరం

ప్రజాశక్తి-వెంకటగిరి రూరల్: పట్టణంలోని 25వ వార్డు ప్రజలు ఇంట్లో నుండి బయట రావాలంటే భయపడుతున్నారు. మున్సిపాలిటీలోని కాంపాలెంలో గత నెల రోజుల నుండి ఓ వానరం పెద్ద చిన్న తేడా లేకుండా మనిషి కనిపిస్తే చాలు పైకి దూకి కరుస్తుండడంతో అవార్డు ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.

బీసీలకు ప్రత్యేక చట్టాల అమలు కోసం పోరాడుతాం

- బీసీ ఆత్మగౌరవ సభలో నాయకులు

ప్రజాశక్తి-తిరుపతి సిటీ: బీసీలకు ప్రత్యేక చట్టాల అమలు కోసం నిరంతరం పోరాడుతామని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు నాగరాజ గౌడ్ తెలిపారు. పాకాల మండలం, కె.ఒడ్డేపల్లిలో ఏపీ బి.సి సంక్షేమ సంఘం ఆత్మీయ గౌరవసభ సమావేశాన్ని మండల నూతన అధ్యక్షులుగా ఎంపికైన పొలకల సుబ్రమణ్యం అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. కార్యక్రమమని ముఖ్య అతిథులుగా ఆ సంఘం అధ్యక్షులు కేశన శంకరరావు, స్టేట్ డైరెక్టర్ రఘుపతి, తిరుపతి జిల్లా ప్రధాన కార్యదర్శి సోమశేఖర్ ఆచార్య. చంద్రగిరి నియోజవర్గ అధ్యక్షులు జగదీశ్వర్, విద్యార్థి సంఘం అధ్యక్షులు వాసు హాజరయ్యారు. ఈ సందర్భంగా నాగరాజు గౌడ్ మాట్లాడుతూ బి.సిలకు ప్రత్యేక చట్టాల అమలు కోసం పోరాడతామని, అన్యాయాలకు గురి కాకుండా కాపాడుతామని, ఎటువంటి సమస్యలు ఎదురైనా వాటిని పరిష్కరించడానికి ముందుంటామని బిసి కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు.



జిల్లా ప్రధాన కార్యదర్శి సోమశేఖర్ ఆచార్య మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో బీసీ అభ్యర్థులను బలోపేతం చేయాలని, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కల్పించిన ఓటు అనే ఆయుధంతో బడుగు బలహీన వర్గాలకు చెందిన అభ్యర్థులను ఎన్నుకొని బీసీల నాయకత్వాన్ని బలపరచాలని పిలుపునిచ్చారు. అనంతరం మండల యువజన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల యువత అధ్యక్షులుగా పొలకల గంగులయ్య, ప్రధాన కార్యదర్శి సోంపల్లి సురేష్, సెక్రటరీగా నక్కల సురేంద్ర, దేరంగుల సుబ్రమణ్యంను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రమణ, మునిరాజు, మురళి, యన్.రామూర్తి, వి.పురుషోత్తం, మునస్వామి, మురగయ్య పాల్గొన్నారు.

శ్మశానం కేటాయించాలని సీపీఎం ధర్నా

ప్రజాశక్తి-పుత్తూరుటౌన్: రూరల్ మండలంలోని తడుకు పంచాయతీలోని రంగంట ఎస్టీ కాలనీ వాసులకు శ్మశానాన్ని కేటాయించాలని ఆదివారం సీపీఎం నాయకులు ధర్నా చేపట్టారు. ఆదివారం కుపాకుల అంకమ్మ చనిపోవడంతో ఆ శవాన్ని తీసుకెళుతుంటే అక్కడి రైతులు ఆ భూమి వారిదని అడ్డుకున్నారు. సీపీఎం కార్యదర్శి వెంకటేష్, దళిత, గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి నందయ్య అక్కడకు చేరుకొని ధర్నా చేపట్టారు. పుత్తూరు తహశీల్దార్‌ను సంప్రదించగా సిబ్బందిని పంపించి అక్కడి రైతులతో మాట్లాడి శ్మశాన స్థలాన్ని మృతదేహానికి



అంత్యక్రియలు చేపట్టారు. కార్యక్రమంలో సురేష్‌బాబు, బాలయ్య, భీమయ్య, వల్లెమ్మ, నాగమ్మ, కన్నెమ్మ, సుశీల తదితరులు పాల్గొన్నారు.

కార్మిక చట్టాలను కాపాడుకుందాం..

సిఐటియు జిల్లా అధ్యక్షులు వాడ గంగరాజు పిలుపు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కార్మికుల అనుకూలమైన చట్టాలను రద్దు చేసి యాజమాన్యాలకు అనుకూలంగా నాలుగు కోడ్‌లు తీసుకురావడం దుర్మార్గమని కార్మికవర్గం ఐక్యమై కార్మిక చట్టాలను కాపాడుకోవాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు వాడ గంగరాజు పిలుపునిచ్చారు. ఆదివారం పుత్తూరులోని ఉపాధ్యాయుల విశ్రాంతి ఫంక్షన్ హాల్‌లో రెండవ రోజు అంగన్వాడీల శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా గంగరాజు మాట్లాడుతూ కేంద్రంలోని మతోన్మాద బీజేపీ ప్రభుత్వం కులాలు, మతాల మధ్య చిచ్చు పెడుతూ ప్రజాసమస్యలను పక్కదారి పట్టిస్తున్నదని వాటిని పసిగట్టి కార్మికుల ఐక్యం కావాలని పిలుపునిచ్చారు. 44 కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు కోడ్‌లు తీసుకువచ్చిందని, అలాగే రైతులకు మూడు నల్లచట్టాలను తీసుకువచ్చి వ్యవసాయాన్ని కార్పొరేట్లకు అప్పగిస్తున్నదని అన్నారు. అంతేకాకుండా విద్యుత్ సంస్కరణలు తెచ్చి భారీస్థాయిలో విద్యుత్ ఛార్జీలు పెంచి ప్రజలపై భారం మోపడమే కాకుండా ఇలాంటి విధానాలను మన రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తూ కార్మికులపై దాడి చేస్తున్నదని తెలిపారు. ఈ విధానాలపై పోరాటాలు చేస్తున్న కార్మికలపై నిర్బంధాలకు గురిచేసి భయభ్రాంతులను చేస్తున్న



సమావేశంలో ప్రసంగిస్తున్న వాడ గంగరాజు

రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని అంగన్వాడీ 42 రోజులు సమ్మె చేసి ప్రభుత్వ వైఖరిని ఎండగట్టారని గుర్తు చేశారు. అందుకే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలలో వస్తున్న కార్మికుల వ్యతిరేక విధానాలను కార్మికవర్గం తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఈ పోరాటం భవిష్యత్ తరాలకు ఆదర్శవంతమైన పోరాటం నిలిచిందని తెలిపారు. ఆ పోరాట సందర్భంగా సాధించిన వాటిని ప్రభుత్వం వెంటనే జీవోలు రూపంలో ఇచ్చి మాట నిలబెట్టుకోవాలని అన్నారు. కార్మికులందరూ ఐక్యంగా కార్మికుల పక్షాణ నిలబడే సిఐటియుని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లాలో కొంతమంది సిడిపిఓలు సూపర్వైజర్లు ఇష్టారాజ్యంగా అంగన్వాడీలపై బెదిరింపులు పాల్పడుతున్నారని మానుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. సిఐటియు నాయకులు వెంకటేష్, అంగన్వాడీ యూనియన్ నాయకులు లక్ష్మీ నరసమ్మ, ధనకోటి, మమత పాల్గొన్నారు.

వినియోగదారులను ఆకర్షిస్తున్న ఇండియన్ ట్రంక్ మార్ట్ ఫుట్

ప్రజాశక్తి- తిరుపతి సిటీ: జిల్లాలో నెలకొల్పిన దేశ వ్యాప్త రిటైల్ రంగంలో ప్రముఖ బిజ్నీస్ సమస్త ఇండియన్ ట్రంక్ మార్ట్ ఫుట్ షోరూం వినియోగదారులను ఆకర్షిస్తోందని బిజ్నిస్ సహ వ్యవస్థాపకులు, సిఈఓ సిద్ధార్థ్ విజ్ తెలిపారు. జిల్లా పర్యటనలో భాగంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రముఖ బి2బి సోర్సింగ్ ప్లాట్‌ఫామ్ అయిన బిజ్నీస్ కంపెనీను 2015లో ప్రారంభించామన్నారు. అప్పటి నుండి ఫుట్-వేర్ క్లాతింగ్ విభాగాలలో మంచి రెవెల్యూషన్ సృష్టిస్తోందన్నారు. భారతదేశం అంతటా మ్యానుఫ్యాక్చర్, రిటైలర్ల మధ్య నిరంతరాయ కనెక్షన్స్ సులభతరం చెయ్యడంలో బిజ్నిస్ విజయానికి హార్ట్‌గా ఉంది. ఈ నెట్‌వర్క్ రిటైలర్స్‌కు విభిన్న రకాల ప్రొడక్ట్ ప్రాప్యతను కలిగి ఉండేలా చేస్తూ, వినియోగదారుల డిమాండ్‌లకు తగ్గట్టు సర్ కొత్త డిజైన్లను అందిస్తోందన్నారు. ఉమ్మడి చిత్తూరులోని సందడిగా ఉన్న స్ట్రీట్ మార్కెట్‌లో, సామాన్యమైన ఇండియన్ ట్రంక్ మార్ట్ ఫుట్-వేర్ సిటీలో చర్చనీయాంశంగా మారింది. ఆసక్తిగల కస్టమర్స్ ఆకర్షితులవుతున్నారు. షాప్ ఓనర్ ముజమ్మిల్ భాయ్ అలసటతో కూడిన ప్రయాణాలు అనిశ్చిత సోర్సింగ్స్ వారిని ఇన్వెంటరీ సవాళ్లకు బదులుగా ఈ యాప్ క్రమబద్ధమైన పరిష్కారాన్ని అందించింది. ఇప్పుడు బిజ్నిస్ సోర్సింగ్ యాప్ ద్వారా దేశంలోని అగ్రశ్రేణి ఫ్యాక్టరీల నుండి కేవలం ఒక్క క్లిక్‌తో నేరుగా ఆర్డర్లు చేసి, సమయం, కృషి, డబ్బును ఆదా చేస్తారని తెలిపారు. వినియోగదారులు తమ ప్రోడక్టు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సీబీఐ వలలో తిరుపతి రైల్వే ఉద్యోగులు

ప్రజాశక్తి- తిరుపతి సిటీ: లంచం తీసుకుంటూ తిరుపతి రైల్వేలో పనిచేస్తున్న ఎస్ఎస్ఈ (ఎలక్ట్రికల్) గంటా రామమోహన్ రావు, ఏడీఈఈ అప్పలరాజు సీబీఐకి పట్టుబడ్డారు. వీరిద్దరినీ శనివారం కర్నూలులోని సీబీఐ ప్రత్యేక న్యాయస్థానంలో ప్రవేశపెట్టగా మార్చి ఒకటి వరకు జ్యుడీషియల్ రిమాండ్ విధించారు. తిరుపతిలోని రైల్వే కోచ్లకు 750 వోల్టు విద్యుత్తు సరఫరా చేసేందుకు మైసూరు చెందిన ఓ సంస్థ రూ.2.56 కోట్లకు టెండరు దక్కించుకుంది. సంస్థ ప్రతినిధుల నుంచి పలు బిల్లుల చెల్లింపు కోసం రామమోహన్‌రావు రూ.40,000లు, అప్పలరాజు రూ.20,000లు తీసుకుంటుండగా సీబీఐ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. దీంతో వారి అదుపులోకి తీసుకొని, కోర్టు ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

గుండె వైద్య శిబిరానికి విశేష స్పందన

- 380మందికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-రామచంద్రపురం(చంద్రగిరి): మండలంలోని శ్రీనివాస మంగాపురం సమీపంలోని వెంకట పద్మావతి ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లో నిర్వహించిన ఉచిత గుండె వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఆదివారం విన్స్ నందు బెంగళూ రుకు చెందిన బెలెనెస్ ఛాంపియన్ హాస్పిటల్ వారు నిర్వహి ంచనున్న ఈ ఉచిత గుండె వైద్య శిబిరంకు చుట్టుపక్కల గ్రామాల నుంచి 380మంది పరీక్షలు చేయించుకున్నట్లు కళా శాల చైర్మన్ పాశం రాజేంద్రప్రసాద్ నాయుడు తెలిపారు. ప్ర ముఖ గుండె వైద్య నిపుణులు డాక్టర్ ప్రజిత్ పాశం వైద్య సేవ లు అందించారు.



పరీక్షలు చేపడుతున్న డాక్టర్ ప్రజిత్ పాశం

రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

జిల్లాలో 42 మంది ఎస్సైలు బదిలీ

ప్రజాశక్తి- తిరుపతి సిటీ: తిరుపతి జిల్లాలో పనిచేస్తున్న 42 మంది ఎస్ఐలను బదిలీ చేస్తూ అనంతపురం రేంజ్ డీఐజీ అమ్మిరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. తిరుపతి వీఆర్ఓ పనిచేస్తున్న ఎస్ఐలు కె.శ్రీనాథ్ ని శ్రీ సిటీకి, ఏ.విజయభాస్కర్ రాజును శ్రీకాళహస్తి టూ టౌన్‌కి, ఎం.జావిద్ బాషను రేణిగుంటకు, జి.సాయినాథ్ ప్రసాద్‌ను వెస్ట్ పోలీస్‌స్టేషన్ కి, కే.జయరామ్ నాయక్‌ను తిరుపతి ట్రాఫిక్‌కు, బి.వెంకట రమణాను ఏర్పేడు, పి.విజయ భాస్కర్ నాయుడును శ్రీకాళహస్తి రూరల్, టి.శివప్రసాద్ను శ్రీ కాళహస్తి టూటౌన్, పి.మురహరి బాబును తిరుపతి ఈస్ట్, శ్రీ రాంప్రసాద్ తిరుపతి ట్రాఫిక్, కే.నాగమణికమును తిరుపతి పిసిఆర్, డి.బాలరాజును తిరుపతి వెస్ట్, ఏ.నాగరాజు తిరుపతి క్రైమ్, ఎం.అల్లాబక్షను శ్రీకాళహస్తి రూరల్, డి.చంద్రశేఖర్ ను తిరుపతి క్రైమ్, కే.మహమ్మద్ రఫీని పుత్తూరుకు, ఎస్.ఇషాక్ బాషను పాకాలకు, సి.బాబును శ్రీకాళహస్తి వన్ టౌన్ కు, డి.లక్ష్మి నారాయణను తిరుపతి ఎస్బి కి, ఎన్.జయరామప్పను తిరుపతి క్యాంపస్‌కు, కేఎల్.కళావతిని తిరుపతి డిసిఆర్బికి, ఎస్.అబ్దుల్ కలాం ఆజాద్, కె.రెడ్డప్పను తిరుపతి ట్రాఫిక్ కు, పి.వెంకటరమణాను తిరుమల క్రైమ్, కే.ఆంజనేయ ప్రసాద్‌ను తిరుపతి పిసిఆర్, కే.శివశంకర్‌ను తిరుపతి ఎయిర్పోర్ట్, బి.తులసన్నును తిరుపతి వెస్ట్, జి.బాలరాజును తిరుపతి ఎస్బి, కే.శ్రీరాములను తిరుమల ట్రాఫిక్, జి.వెంకటరమణ తిరుపతి ఎస్బి, ఎస్ఏ.రఫిక్‌ను తిరుపతి పిసిఆర్, పి.శ్రీనివాసులును సత్యవేడుకు, ఏ. దాదాపీర్‌ను తిరుపతి ఎస్బికు, శ్రీ సత్యసాయి జిల్లాలోని దిశ పోలీసు స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న డి.లావణ్యను తిరుపతి ఈస్ట్‌కు, తిరుపతి స్పెషల్ బ్రాంచ్‌లో పనిచేస్తున్న ఎం.అరుణను శ్రీకాళహస్తి వన్ టౌన్‌కు, చంద్రగిరిలో పనిచేస్తున్న ఐ.హిమబిందువును తిరుపతి స్పెషల్ బ్రాంచ్‌కు, శ్రీకాళహస్తి టూ టౌన్‌లో పనిచేస్తున్న ఆర్.విజయ్ కుమార్ నాయక్‌ను భాకరాపేటకు, తిరుపతి క్రైమ్‌స్టేషన్లో పనిచేస్తున్న ఓ.రామస్వామిని అలిపిరికి, శ్రీకాళహస్తి వన్‌టౌన్‌లో పనిచేస్తున్న టి.వెంకట సుబ్బయ్యను తిరుచానూరుకు, తిరుమల టూ టౌన్‌లో పనిచేస్తున్న టి.సాయినాథ్ చౌదరిని తిరుపతి క్రైమ్‌కు, శ్రీ సిటీలో పనిచేస్తున్న ఏ.హరిప్రసాద్ను తిరుపతి ఎస్వీయూ క్యాంపస్‌కు, తిరుచానూర్ పోలీస్‌స్టేషన్లో విధులు నిర్వహిస్తున్న ఏ.చిరంజీవిని ఆర్‌సిపురానికి బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఒకటి, రెండు రోజులు వారు బదిలీ అయిన ప్రాంతాల్లో బాధ్యతలు చేపట్టనున్నారు.

ప్రజాశక్తి వార్తకు స్పందన

ఆర్‌సీ పురం ఎస్ఐగా చిరంజీవి

ప్రజాశక్తి-రామచంద్రాపురం: రామచంద్రాపురం ఎస్ఐగా చిరంజీవిని నియమిస్తూ ఆదివారం పోలీసు ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. కాగా ఈ నెల 8న ప్రజాశక్తిలో 'ఆర్‌సీ పురం అంటే టెర్రర్' శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించిన అధికారులు ఎస్ఐని నియమించారు.

అలరించిన పశువుల పండుగ

ప్రజాశక్తి-రామచంద్రపురం: మండలంలోని పివిపురం గ్రామంలో పశువుల పండుగ ఆదివారం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ జల్లికట్టు కార్యక్రమానికి పశువుల యజమానులు తమ కోడె గిత్తలు, పశువుల కొమ్ములను నునుపుగా చెక్కి, కొమ్ములకు రంగులు పూసి అందంగా తీర్చిదిద్దారు. అనంతరం గ్రామంలో ఎదురు తడికలతో ఏర్పాటు చేసిన దొడ్లల్లో పశువులను నిర్బంధించారు. పశువుల కొమ్ములకు తమ అభిమాన రాజకీయ, సినిమా నటుల ఫోటోలతో చెక్క పలకలు తయారు చేయించి. వివిధ రకాల రంగు కాగితాలతో, నెమలీకలతో అలంకరించి కుమ్ములకు కట్టారు. పశువులకు పసుపు కుంకుమ పెట్టి, పూలమాలతో సుందరంగా అలంకరించారు. మధ్యాహ్నం ఒంటిగంటకు, పశువులు, కోడెగిత్తలను గుంపులు గుంపులుగా డబ్బులు టపాకాయలు పేల్చి బెదిరిస్తూ జల్లికట్టులోకి ప్రవేశింపజేసేందుకు సిద్ధం చేశారు. కోడె గిత్తలు రంకేసి, కాళ్లు దువ్వాయి. దీంతో యువకులు వాటిని పట్టుకునేందుకు హుషారయ్యారు.

'చార్జీల మోత'

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: సీఎం వైఎస్ జగన్ బటన్ నొక్కుడుకు ప్రతి సారీ చార్జీలు, పన్నులు అమాంతం పెరుగుతున్నట్లు టీడీపీ నగరి ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్ అన్నారు. ఆదివారం పుత్తూరు మున్సిపాలిటీ పరిధిలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వచ్చే ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని అభ్యర్థించారు.

సమస్యలపై పోరాడుతాం..

ప్రజాశక్తి-బాలాయపల్లి: ప్రజాసమస్యలపై పోరాడి సాదిస్తామని జనసేన వెంకటగిరి సమన్వయ కర్త గూడూరు వెంకటేశ్వర్లు పేర్కొన్నా రు. ఆదివారం మండలంలోని అంబలపూడి గ్రామంలో జనసేన పార్టీ మండల అధ్యక్షుడు పగడాల వెంకటరమణ అధ్వర్యంలో పవన్‌కళ్యాణ్ నాయకత్వంలో జనంలోకి జనసేన కార్యక్రమాన్ని నిర్వహించారు.

24న తిరుపతి 894 పుట్టినరోజు

ప్రజాశక్తి- తిరుపతి (మంగళం): ప్రపంచంలో ఏ నగరానికి లేని ఖ్యాతిని రామానుజాచార్యులు తిరుపతి నగరానికి అందించారని, తిరుపతి పుట్టినరోజును భావితరాల వారు కూడా నిర్వహించుకునేలా ప్రచారం జరగాలని ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తిరుపతి పుట్టినరోజుకు సంబంధించిన కరపత్రాలను ఎమ్మెల్యే, నగరపాలక సంస్థ మేయర్ డాక్టర్ ఆర్.శిరీషతో ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రపంచ ప్రసిద్ధిగాంచిన తిరుపతి పుణ్యక్షేత్రంలో మన సాంప్రదాయ సంస్కృతిని విశ్వవ్యాప్తం చేయాల్సిన అవసరం ఉందన్నారు. కాలగర్భంలో కలిసిపోయిన ఎన్నో నగరాలకు ఇలాంటి అరుదైన ఖ్యాతి దక్కలేదని, తిరుపతి నగరానికి జరిగే 894వ పుట్టినరోజును తిరుపతి పుర ప్రజలతో పాటు, తిరుపతికి వచ్చే యాత్రికులకు అవగతం అయ్యేలా కార్యక్రమాల నిర్వహణ టిటిడి, నగరపాలక సంస్థ సహకారంతో నిర్వహిస్తున్నామన్నారు. తిరుపతి పుట్టినరోజుకు ప్రతీకగా ప్రతిరోజు శ్రీ గోవిందరాజ స్వామి ఆలయంలో సంస్కృతంలో వేద పండితులు వేదాలు ఆలపిస్తారన్నారు. సమావేశంలో వైసిపి పట్టణ అధ్యక్షులు పాలగిరి ప్రతాపరెడ్డి, వైసీపీ నాయకులు దొడ్డారెడ్డి సిద్ధారెడ్డి పాల్గొనారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే భూమన

టిఎస్ఎఫ్ఏ పురస్కారాలు అందుకున్న లఘు చిత్రాలు

ప్రజాశక్తి-తిరుపతిటౌన్: 2022-23 సంవత్సరంలో నిర్మించిన లఘు చిత్రాలకు ప్రకటించిన పురస్కారాల్లో ఉమ్మడి చిత్తూరు జిల్లా నుంచి రెండు లఘు చిత్రాలు పురస్కారాలను అందుకున్నాయి. హైదరాబాద్‌లో కళారాజ్ మీడియా, ఎంటర్టైన్మెంట్ శనివారం రాత్రి నిర్వహించిన టిఎస్ఎఫ్ఏ (తెలుగు షార్ట్ ఫిల్మ్స్ అవార్డ్స్)లో తిరుపతికి చెందిన మురళి కొడగంటి స్వీయ రచన, దర్శకత్వంలో చిత్రీకరించిన "పోరాటం" అనే ఇండిపెండెంట్ ఫిల్మ్‌కి బెస్ట్ డైరెక్టర్ అవార్డ్, అదే చిత్రంలో ఓ జర్నలిస్టు పాత్రలో నటించిన పండ్లూరు వెంకటేష్ బెస్ట్ యాక్టర్



అవార్డు అందుకున్నారు. అదేవిధంగా పీలేరు ఎంజెఆర్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ విద్యార్థులు రామ్ చరణ్, చాణిక్య లు చిత్రీకరించిన "చిట్టి ప్రేమ" లఘు చిత్రం టిఎస్ఎఫ్ఏ పురస్కారాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా వారిని పలువురు యూట్యూబర్లు, కళాకారులు అభినందించారు.

చెవిలో పువ్వుతో మోకాళ్ళ పైన నిరసన

- రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించాలి

ప్రజాశక్తి-క్యాంపస్: వేతనాలు పెంచాలని కోరుతూ ఆదివారం చెవిలో పువ్వు, మోకాళ్ళపై సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. సమస్యల పరిష్కారానికి కై ఫిబ్రవరి 16వ తేదీ నుండి రాష్ట్ర వ్యాప్తంగా నిరవధిక సమ్మెలో వెళ్లారు. తిరుపతి ప్రాంతీయ వ్యవసాయ కళాశాల ప్రధాన ద్వారం వద్ద నిరసన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా నాయకులు మాట్లాడుతూ ఎస్.జయచంద్ర, వెంకటేష్, ఐద్వా జిల్లా కార్యదర్శి డాక్టర్ పి.సాయిలక్ష్మి మాట్లాడుతూ గత 22 సంవత్సరాల నుండి పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకి కనీసవేతనాలు అమలు చేయడం లేదని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం, టైం స్కేలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి నెల జీతాలు ఇవ్వాలి, టైంస్కేలు అమలు చేయాలని, ఈఎస్ఐ, పిఎఫ్ మరియు ప్రమాద బీమా ఐదు లక్షల రూపాయలు, ప్రసూతి సెలవులు, ప్రభుత్వ సెలవులు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షురాలు వరలక్ష్మి, కార్యదర్శి రాకేష్, నాయకులు సుబ్బు, రేవతి, చంద్రమ్మ, అనురాధ, మునిలక్ష్మి, రమా, మురళి తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలియజేస్తున్న నాయకులు

వర్సిటీలో జాతీయ సదస్సు ప్రారంభం

ప్రజాశక్తి-క్యాంపస్: శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం స్టాటిస్టిక్స్ డిపార్ట్‌మెంట్, ఇండియన్ సొసైటీ ఫర్ ప్రాబబిలిటీ అండ్ స్టాటిస్టిక్స్, ఎస్వి యూనివర్శిటీకి చెందిన స్టాటిస్టిక్స్ పూర్వ విద్యార్థులు సంయుక్తంగా 18-19, ఫిబ్రవరి 2024 మధ్యకాలంలో ప్రొ.జి.ఎస్.శంకరనారాయణన్ జన్మ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా ఆదివారం అంతర్జాతీయ వర్క్‌షాప్ "డేటా సైన్స్‌లో యాదృచ్ఛిక నమూనాలు" భాగంగా "గణాంకాలు మరియు డేటా సైన్స్‌లో ఇటీవలి పురోగతి" అనే అంశంపై తో జాతీయ సదస్సును నిర్వహించారు.

అభివృద్ధి నిరంతర ప్రక్రియ


వై ఏపీ నీడ్స్ జగన్ ప్రోగ్రాంలో మోహిత్ రెడ్డి

ప్రజాశక్తి-తిరుపతి (మంగళం): ప్రజలకు అందించే అభివృద్ధి అనేది దశలవారీ నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందని, పదవిలో ఉన్నంతకాలం ప్రజాసమస్యలకు, ప్రజాభివృద్ధికి తగిన తోడ్పాటు అందించామని ఈ ప్రక్రియ ఇలాగే కొనసాగడానికి రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు తమకు మద్దతుగా నిలవాలని చంద్రగిరి నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్ రెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఆదివారం మంగళం పరిధిలోని తిరుమల నగర్ గ్రామపంచాయతీలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని పంచాయతీ వైసీపీ బాధ్యులు గుండ్రాజు శివశంకరరాజు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. భారీ ర్యాలీ నడుమ పంచాయతీకి చేరిన మోహిత్‌రెడ్డి ముత్యాలమ్మ వారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. గ్రామపంచాయతీ సర్పంచ్ వకుళ, మంగళం డివిజన్ వైసిపి అధ్యక్షులు ప్రళయకావేరి నారాయణరెడ్డి, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ లక్ష్మీదేవి, రమేష్, తుంటి సుదాయధవ్, రాంబాబు, బైరెడ్డి రమేష్, ప్రసాద్ బాబు పాల్గొన్నారు.

లాడ్జీ యజమానులు, యాత్రికులు డిష్యుం.. డిష్యుం

- పోలీస్‌స్టేషన్ చేరిన పంచాయితీ

ప్రజాశక్తి-తిరుపతి సిటీ: తిరుపతికి వచ్చిన భక్తులు, వారికి రూముల అద్దెక్కించిన లాడ్జి సిబ్బంది మధ్య, నీటి విషయమై ఘర్షణ చోటు చేసుకోవడంతో ఒకరిపై మరొకరు దాడిలకు పాల్పడి, పోలీసులకు ఫిర్యాదు చేసిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. ఈస్ట్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పెద్దకాపు లేఅవుట్‌లో ఉన్న శ్రీనివాస గ్రాండ్ లాడ్జ్‌లో బెంగళూరు నుండి వచ్చిన 8మంది యాత్రికుల బృందం లాడ్జిలో 202, 502 నెంబరు గల రూములు శనివారం తీసుకొని సేదతీరారు. ఆదివారం ఉదయం 5 గంటలకు వెకెట్ చేయవలసి ఉండగా గంట ఆలస్యం అయింది. అడ్వాన్స్‌గా ఉన్న నగదులో కొంత ఇవ్వాలని లాడ్జి సిబ్బందిని యాత్రికులు కోరారు. 24గంటల కంటే ఆలస్యం అయిన కారణంగా డబ్బులు తిరిగి ఇవ్వమని సిబ్బంది కరాకండిగా చెప్పారు. లాడ్జి సిబ్బంది నీటి సరఫరా చేయడంలో ఆలస్యం చేశారని, అందుకే ఫెషప్ అయ్యేందుకు అరగంట ఆలస్యమైందని, దానికి మాది తప్పు అనడం సరైందికాదని యాత్రికులు తిరిగి సమాధానం ఇచ్చారు. దీంతో ఒకరిపై ఒకరు దూషణలు చేసుకొని, పోట్లాటకు దిగారు. కోపద్రకులైన యాత్రికులు లాడ్జిలోని రెండు డోర్ అద్దాలను, క్యాష్ టేబుల్, టీవీ, ప్రింటర్, దేవుడు



ప్రతిమలను ధ్వంసం చేశారు. లాడ్జి యాజమాన్యం వివేక్ అనే వ్యక్తిపై సుత్తితో దాడి చేశారు. యాత్రికులోని ఆడవాళ్లు చెప్పులతో దాడి చేశారంటూ లాడ్జ్ యాజమాన్యం వాదించింది. తమది తప్పు లేదని సీసీ పుటేజ్‌ని లాడ్జి యజమాన్యం ఈస్ట్ పోలీసులకు అప్పగించింది. ఇరువురి వాదనలు విన్న ఈస్ట్ పోలీసులు ఈ ఘటనపై విచారణ చేపట్టారు.